## పురుగు మందులు లేకుండా పంటల సాగు

# అమృత జలం - పంచగవ్య



పంటను మామూలుగా పెంచడం వేరు... ఆరోగ్యంగా పెంచటం వేరు. ఆరోగ్యవంతంగా పెంచినప్పుడు పురుగుల నుంచి, హాని చేసే ఇతర సూక్ష్మజీవుల దాడి నుండి పంట దానంతట అదే తట్టుకుని నిలబడుగల్గుతుంది. మంచి ఫలసాయాన్నిస్తుంది. నేలనిండా మేలు చేసే సూక్ష్మజీవులను నింపడం ద్వారా, సేంద్రియ పదార్థం చేర్చడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. అనేక పద్ధతుల ద్వారా హాని చేసే పురుగులను, సూక్ష్మక్రిములను మొక్కల మీద దాడి చేయకుండా నియంత్రించవచ్చు, లేదా నిర్మూలించవచ్చు. అమృత జలం, పంచగవ్య ద్రావణాలు పంటమీద చల్లడం కూడా అలాంటి పద్దతులే. ఖర్చు లేని ఈ ద్రావణాలను చాలా సులభంగా తయారుచేసుకోవచ్చు. ఎలాగంటారా.... చూడండి మీకే తెలుస్తుంది!

# అమృత జలం

కావలసిన పదార్థాలు

- ఆవు మూత్రం (1 లీటరు)
- ఆవు పేడ (1 కిలో)
- బెల్లం (ఆర్గానిక్) (పావుకిలో /250 గ్రాములు)
- క్లోరిన్ కలపని నీళ్ళు (10 లీటర్లు)

తయారు చేసే పద్ధతి:

10 లీటర్ల నీటిని తీసుకుని దానిలో పావు కిలో బెల్లం వేసి కలియబెట్టాలి.

లీటరు ఆవు మూత్రంలో కిలో ఆవు పేడ కలపాలి.

బెల్లం కరిగిన నీటికి ఈ ఆవుపేడ, ఆవు మూత్రం ద్రావణం కలపాలి.

ఒక ప్లాస్టిక్ డబ్బాలో గానీ, మట్టికుండలో గానీ వీటిని కలుపవచ్చు.

ద్రావణంలో కలిపినవన్నీ బాగా కరిగేటట్టు కలియబెట్టాలి.

అలా కలియబెట్టిన ద్రావణాన్ని ఒక రోజంతా (24 గంటలు) ఉంచాలి.

అదే పంటకు పుష్టినిచ్చే అమృత జలం...

వాడే పద్ధతి:

తయారైన అమృతజలం నుంచి ప్రతి లీటరు ద్రావణానికి 10 లీటర్ల నీళ్ళు కలపాలి.

పల్చటి బస్తాతో కానీ, నైలాను నెట్‌తో కానీ ద్రావణాన్ని వడపోయాలి.

ఇలా వడపోసిన ద్రవాన్ని స్ప్రేయరు ద్వారా పంటపై పిచికారి చేసుకోవచ్చు.

ఒకసారి తయారుచేసుకున్న అమృత జలాన్ని 30 రోజుల పాటు నిలవ ఉంచవచ్చు.

మోతాదు

బాగా ఎదిగిన పొలానికి బర్రె/ఆవు / ఎద్దు మూత్రం 20 లీటర్లు, 20 కిలోల పేడ, 5 కిలోల బెల్లం, 150 లీటర్ల నీరు అవసరమవుతాయి.

పిచికారి చేయడం వీలుకాకపోతే, పొలానికి నీరు పెడుతున్నప్పుడు కాలవ మొదట్లో నీళ్లల్లో అమృత జలాన్ని కలిపి పంటకు పారించవచ్చు.

ఉపయోగం :

యూరియా చల్లినప్పుడు మొక్కలు ఏపుగా పెరగడమే కాక, మొక్కనాజూకుగా మారి పురుగులు, తెగుళ్ళకు ఎక్కువగా ఆశిస్తాయి.

అమృత జలాన్ని చల్లినప్పుడు మొక్కలకు నత్రజని లభ్యమవ్వడమే కాక హానిచేసే పురుగులను, సూక్ష్మక్రిములను దూరంగా ఉంచుతుంది.

# పంచగవ్య

గోవు నుంచి వచ్చిన 5 పదార్థాలతో చేసింది కాబట్టి దీనిని 'పంచగవ్య' అంటారు.

## కావలసిన పదార్థాలు

- 5 కిలోల పేడ
- 3 లీటర్ల మూత్రం
- 2 లీటర్ల పాలు
- 2 లీటర్ల మజ్జిగ
- అరకిలో (500 గ్రాములు) నెయ్యి
- అరకిలో నుంచి కిలో వరకు బెల్లం (హైడ్రోజన్ సల్ఫైడ్, హైడ్రోస్ కలపని ఆర్గానిక్ బెల్లం వాడితే మంచిది)
- 3లీటర్లు లేత కొబ్బరి బొండం నీరు
- 10 నుంచి 12 కుళ్ళిన పండ్లు
- 2 లీటర్ల కల్లు (దొరికితే)

## తయారుచేసే పద్ధతి:

ముందుగా ఆవుపేడను, చల్లార్చిన నెయ్యిని ఒక కుండలో తీసుకుని చేతితో బాగా కలపాలి.

కుండను ఒక తడిగుడ్డతో కప్పి ఉంచాలి. నాలుగు రోజులు నిలవ వుంచాలి.

ప్రతిరోజు చేతితో కలుపుతూ ఉండాలి. ఈ నాలుగు రోజుల్లో పేడలో నెయ్యి పూర్తిగా కరుగుతుంది.

అయిదవ రోజున పేడ, నెయ్యి ఉన్న కుండలో పైన చెప్పిన వాటిలో మిగిలిన పదార్థాలన్నీ బాగా కలిపి 15 రోజుల పాటు నిలువ ఉంచాలి.

ప్రతి రోజూ పొద్దున, మధ్యాహ్నం, సాయంత్రం తప్పనిసరిగా చేతితో బాగా కలపాలి.

16వ రోజు నుంచి ద్రావణాన్ని పంటపై తగు మోతాదులో తీసుకుని వాడుకోవచ్చు. 6 నెలల పాటు ద్రావణం నిలువ ఉంచుకోవచ్చు. ఈ మధ్య కాలంలో ప్రతిరోజు ఒకసారి కలపాలి.

## వాడే పద్ధతి :

పావు లీటరు (250 మి.లీ.) పంచగవ్యను 10 లీటర్ల నీటిలో కలపాలి.

పొలానికి తగ్గట్టుగా తగు మోతాదులో ద్రావణం చల్లుకోవాలి.

పొలానికి నీరు పెట్టేటప్పుడు ఒక ఎకరానికి 5 నుంచి 20 లీటర్ల పంచగవ్యను పంట కాల్వల్లో నీరు పారేటప్పుడు కలిపి పారించవచ్చు.

## ఉపయోగాలు:

- మొక్క పెరుగుదల బాగుంటుంది
- పురుగులు, తెగుళ్లను దూరంగా ఉంచుతుంది
- మొక్క వేళ్ల దగ్గర వ్యాధి నిరోధకత పెరుగుతుంది
- ఆకుల మీద చల్లితే నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషక పదార్థాలు మొక్కకు అందుతాయి.

*ఇంకా వివరాలకు సంప్రదించండి:*

**పి. కిషన్ రావు**
ఫోన్. నెం. 23545485 / 9849248798

**వాసన్**

12-13-452, వీధి నెం.1, తార్నాక,
సికింద్రాబాదు-500 017,
ఫోన్. నెం. 040-27015295/96

డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్. - ఇక్రిసాట్, నీరు, ఆహారం,
పర్యావరణంపై సంవాదం ప్రాజెక్టు
ఇక్రిశాట్, పటాన్‌చెరువు, హైదరాబాద్,
ఫోన్: 040 - 30713762